ప్రజాశక్తి
సోమవారం 7 ఏప్రిల్ 2025

తోటపల్లి కాలువల ఆధునికీకరణకు రూ.37 కోట్లు

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి కాలువల ఆధునీకరణ పనులకు రూ.37 కోట్లు మంజూరైనట్టు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఆదివారం ఇక్కడికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తోటపల్లి పనులు గాలి వదిలేసిందని విమర్శించారు. వచ్చే ఖరీఫ్ నాటికి ప్రతి సెంటు భూమిని సాగునీరందెలా చర్యలు తీసుకుంటామన్నారు తమ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇందులో భాగంగా త్వరలోనే డీఎస్సీ ప్రకటిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, అంపోలు శ్రీనివాసరావు, సుంకర అనిల్, పడాల రాంబాబు తదితరులు ఉన్నారు.

సాలూరు మండలం దెన్సరాయిలో ఊటనీరు పడుతున్న మహిళలు

గొంతెండుతున్న గ్రామాలు

- పూర్తికాని జెజెఎం పనులు
- తాగునీటికి ప్రజలు అవస్థలు
- అంతంత మాత్రమే అమలవుతున్న క్రాస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి- పాలకొండ

వేసవి ఆరంభంలోనే పలు గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న బోర్లు ద్వారా సరిగ్గా నీరు రాక, రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేయకపోవడంతో మండలంలో తాగునీటి సమస్యలకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. గెడ్డల పక్కనున్న గ్రామస్తులు చలమలనీటినే ఆశ్రయిస్తున్నారు.

మండలంలో 38 బోర్లు, 25 రక్షిత మంచి పథకాలతో పాటు 56 నేలబావులు ఉన్నాయి. అయితే వేసవికాలంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ప్రతి ఏటా నేలబావుల్లో నీళ్ల ఇంకిపోతున్నాయి. అలాగే బోర్లు ద్వారా నీరందే పరిస్థితి లేదు. మండలంలోని వెంకటరాయిని వలస, కొత్తబర్నా, కోటిపల్లి తదితర గ్రామాల్లో నేల బావులు అడుగంటిపోవడంతో ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. బాసూరులో ప్రజలకు చలమల నీరే ఆధారం. ఎన్ పారాపురంలో రెండు బోర్లు ఉండగా అవి కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో గ్రామస్తులు నీటికి ఆందోళన చెందుతున్నారు. లుంబూరులో మంచినీటి పథకం ఉన్నప్పటికీ బావి పాడవడంతో బోర్లు పైనే గ్రామస్తులు ఆధారపడుతున్నారు.

ఎం.సింగపురం, విపిరాజుపేట గ్రామాల్లో కూడా నీటి కోసం బోర్లు దగ్గర ఆయా గ్రామాల ప్రజలు క్యూ కడుతున్నారు. ఒక్క బిందె నీరు దొరికితే చాలు అన్న పరిస్థితి ఆ గ్రామాల్లో కనిపిస్తుంది.

పూర్తికాని జలజీవన్ మిషన్ పనులు

మండలంలో ఏ గ్రామంలోనూ జలజీవన్ మిషన్ పనులు పూర్తి కాలేదు. మండలంలో 45 పనులు ప్రారంభించినప్పటికీ ఇంతవరకు ఒక్క దగ్గర కూడా ఇంటింటా కుళాయిలు వేసే పరిస్థితి కనిపించలేదు. కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 20 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంకా ప్రారంభానికి నోచుకోని పనులు మరో రెండునెలల్లో ఎలా పూర్తవుతాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

అంతంత మాత్రమే క్రాస్ ప్రోగ్రాం

గ్రామాల్లో బోర్ల పనితీరును క్రాస్‌ప్రోగ్రాం ద్వారా పరిశీలించాల్సి ఉంది. అయితే ఈ ప్రోగ్రాం అంతంత మాత్రమే అమలైనట్లు తెలుస్తుంది. పూర్తి స్థాయిలో పట్టించుకున్నట్లు కనిపించ లేదు. దీనివల్ల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

బాసూరులో అర్థాంతంగా నిలిచిపోయిన రక్షితమంచినీటి పథకం పనులు

ఎన్నాళ్లకు తాగునీటి కష్టాలు తీరుతాయో

తమ గ్రామంలో తాగు నీటి కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియడం లేదు. ఎంతమంది అధికారులు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా, మా గ్రామానికి తాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

లెంక చిన్నమ్ముడు, బాసురు.

తాగునీటి సమస్యలపై దృష్టి పెడుతున్నాం

మండలంలో ఎక్కడా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా దృష్టి పెడుతున్నాం. ఎక్కడ ఏ బోరు మరమ్మతు గురైనా వెంటనే స్పందిస్తున్నాం. దీనికి ప్రత్యేకంగా ఒక సెల్‌ను ఏర్పాటు చేశాం.

ప్రవళిక, ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్. సాలరొండ

అధికారులు దృష్టి పెట్టాలి

తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి అధికారుల దృష్టి పెట్టాలి. రక్షిత మంచి నీటి పథకం పనులు పూర్తి కాకపోవడంతో వేసవిలో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. కావున అధికారులు, పాలకులు దృష్టి సారించి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

సిర్లాపు మల్లేశ్వరి, సర్పంచ్, బాసూరు

ఊటనీరే దిక్కు

సాలూరు రూరల్: మండలంలోని దెన్సారాయిలో తాగునీరు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుఆన్నరు. గతంలో ఈ గ్రామంలో తాగునీటి కోసం ఐటిడిఎ వారు ఒక ఊట బావిని నిర్మించారు. చాలా ఏళ్లుగా ఆ బావిలో నుంచి నీళ్ల తోడుకొని ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులు గమనించిన గతంలో అధికారులు ఆ ఊట బావిలోనే ఒక మోటార్‌ను ఏర్పాటు చేసి గ్రామం నడిబొడ్డున 10వేల లీటర్ల మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకు నిండడానికి కనీసం మూడు గంటలు పడుతుంది. దీనికి కారణం ఆ బావిలో నీరు లేకపోవడం. ఒక్క వర్షాకాలంలోనే ఆ బావిలో నీరు ఉంటుంది. మిగతా సీజన్లలో మోటారుకు నీరందే పరిస్థితి లేదు. దీంతో గ్రామస్తులకు తాగునీరందడంలేదు. దీంతో దగ్గరలోనే ఒక నీటి కుంటలో నీటిని చలమల ద్వారా పట్టి తాగుతున్నామని స్థానిక మహిళలు చెబుతున్నారు. తమ బాధలను ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా చూస్తాం చేస్తాం అని చెప్పడమే కానీ నేటి వరకూ దీన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ తాగునీటి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

తాగునీటి సమస్యలు వినిపించరాదు : కలెక్టర్

పార్వతీపురం : వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు వినిపించరాదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారుల ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలని అన్నారు. సమస్య ఉన్నచోట తక్షణమే స్పందించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖలు నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని, రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా నీటి నాణ్యతా ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 14 రకాల టెస్టులను చేపట్టడం జరుగుతుందని, దీన్ని ప్రతి రోజు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని, అన్ని రకాల టెస్టులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవిలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ, మండలాల్లోని అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు ఆయా ప్రాంతాల్లో గల కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలని చెప్పారు. ఈ టెలీ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మంత్రి సంధ్యారాణి దంపతులు, ఎమ్‌పి అప్పలనాయుడు

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణ, భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వేలాది మంది తిలకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు.. సీతారాములకు పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. సంప్రదాయానుసారం ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన తనయ, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి స్వామివారికి మధుపర్కాలు సమర్పించారు. ఎప్పటిలాగే సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రం నుంచి పట్టువస్త్రాలను, మంత్రి శ్రీనివాస్, విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా, సింహాచలం ఇఒ సుబ్బారావు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు సాయి రామాచార్యులు, కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వివాహ ఉత్సవాన్ని హయగ్రీవాచార్యులు తదితర వేద పండితులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి, మాజీ ఎమ్‌పి ఝాన్సీ లక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, దేవాదాయ శాఖ డిసి సుజాత, ఎసి శిరీషా, ఆర్‌డిఒ డి.కీర్తి, రామతీర్థం ఆలయ ఇఒ వై.శ్రీనివాస్, తహశీల్దార్ సుదర్శన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

10న కురుపాంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కురుపాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ కలిగి 18 ఏళ్ల నిండి 28 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈనెల 10న ఉదయం 9గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని అన్నారు. జాబ్ మేళాకు హాజరు కానున్న అభ్యర్థులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలని ఆ ప్రకటనలో వివరించారు. మరిన్ని వివరాలకు 63034 93720, 89788 78557 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గిరిజనులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గిరిజనులకు అండగా ఉంటుందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ అన్నారు. మండలంలోని దుగ్గి, రోలుగుడ్డి పంచాయతీ గౌరీపొలం గ్రామాలకు పిఎం జన్ మన్ పథకం ద్వారా రూ.8 లక్షల చొప్పున అంచనా విలువతో 10వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, ఇంటి ఇంటికి మంజూరైన నీటి కుళాయిలకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ పనులు త్వరితగతిన నాణ్యతతో చేపట్టి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. రోలుగుడ్డి, చాకలిగూడలో సంసాద్ ఆదర్శ గ్రామ్ యోజన" పథకంలో భాగంగా రూ.32 లక్షలు చొప్పున అంచనా విలువతో మంజూరైన గ్రామ పంచాయితీ భవవాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామాల్లో రహదారులు పనులు కూడా జరుగుతున్నయని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, జిసిసి చైర్మన్ రామారావు, ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్ కుమార్, మండంగి విశ్వనాథం, మండంగి ప్రకాశం, గంగరాజు, ఇమరక ప్రసాద్, కురంగి అజయ్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ ఆర్.సత్యం, అధికారులు పాల్గొన్నారు.

పలువురు జనసేనలో చేరిక

మండలంలోని దుగ్గి పంచాయతీలో వైసిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. జనసేనలో చేరిన వారిలో అరిక రవి, అరిక వెంకట్, కొండా గౌరి దండయ్య, బిడ్డిక గంగరాజు, అరిక మాసయ్య, అడ్డకుల మాసయ్య, అరిక కొండల రావు, అరిక ప్రకాశ రాజు,కొండగౌరి మంగయ్యతో కలిసి 50 కుటుంబాలు చేరాయి. వీరికి ఎమ్మెల్యే స్వయంగా జనసేన కండువా వేసి సాధారంగా జనసేన పార్టీలోకి ఆహ్వానించారు.

బిసి యూనిట్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతుందని, ఆ మేరకు ఎంపిడిఒలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఇంటర్వ్యూలు పూర్తి చేశారని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే పూర్తి చేసి ఆయా బ్యాంకుల సమన్వయంతో రుణ మంజూరు పూర్తి చేసి బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాగిన్‌కు వెంటనే పంపించాలని అన్నారు. ఈనెల 11న ముఖ్య మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో 1221 యూనిట్లను రూ.23.24 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన సంగతి విదితమే అని ఆయన చెప్పారు.

గాయపడిన యువతికి మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం

యువకుడి చేతిలో తీవ్రంగా గాయపడిన యువతి అఖిలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు.. వైద్యులకు సూచించారు. గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన యువతి అఖిలపై యువకుడు దాడికి పాల్పడటంతో ఆమె విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం స్థానిక ఆస్పత్రిలో యువతి అఖిలను ఎమ్మెల్యే కళా వెంకటరావు పరామర్శించారు. అఖిల కోలుకుంటోందని ఆయన చెప్పారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించారని తెలిపారు.

అన్యాక్రాంతమవుతున్న డిసిఎంఎస్ స్థలం

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తోన్న అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ నడిబొడ్డునున్న విలువైన డిసిఎంఎస్ స్థలం రోజురోజుకు కబ్జాదారుల కన్యాక్రాంతమవుతుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ రైతు బజార్ నిర్మిస్తామని పాలకులు చెప్పినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. గత ప్రభుత్వంలో శంకుస్థాపన కూడా చేశారు. అయితే పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఎంతో విలువైన ఖాళీ స్థలం కొంతమంది ఆక్రమణదారుల కబ్జాలో చిక్కుకుంది. ఎకరా 60 సెంట్లకు పైగా డిసిఎంఎస్‌కు నాగవంశపు వీధికి దగ్గర స్థలం ఉంది. అయితే అంత విస్తీర్ణం ప్రస్తుతం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. కబ్జా కోరల్లో డిసిఎంఎస్ స్థలం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు బజార్ మాట పక్కన పెడితే ఉన్న స్థలం అక్రమదారులు కబ్జా చేసి దర్జాగా నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడమే నని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గ్రామకంఠం పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఇష్టరాజ్యంగా నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డిసిఎంఎస్ స్థలం చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

ముస్లిముల గొంతు నొక్కడానికే వక్ఫ్ చట్ట సవరణ

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో ముస్లిము సమాజానికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ఆమోదం తమ గొంతు నొక్కడానికేనని స్థానిక ముస్లిం సంస్థల ప్రతినిధులు షేక్ ఇమామ్ భాషా, షేక్ ఇక్బాల్, షేక్ బాజీ, షేక్ సుబానీ, షేక్ బకారీ అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ముస్లిములకు జరిగిన అన్యాయంపై ముద్రించిన కరపత్రాన్ని పట్టణంలో విడుదల చేశారు. అనంతరం సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ ముస్లిము సమాజానికి జరిగిన నష్టాన్ని వివరిస్తూ దేశంలో ప్రజల మధ్య లౌకిక భావం పెంపొందించకుండా కులాలు, మతాలుగా పాలకులు విభజిస్తున్నారని తెలిపారు. ఈ చట్ట సవరణను బిజెపితో పాటు రాష్ట్రంలో టిడిపి జనసేన బలపరచడం అన్యాయమని, రాజ్యాంగంలో అన్ని మతాలకు సమానమైన హక్కులు కల్పించి వాటి ఆస్తులకు రాజ్యాంగంలో రక్షణగా చట్టాలు ఉన్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా గతంలో స్పష్టం చేసినప్పటికీ రాజ్యాంగంలో 25, 29, 30 నిబంధనలను తుంగలో తొక్కేలా బిజెపి చట్ట సవరణ కోరిందని తెలిపారు. ఈ చట్ట సవరణ ద్వారా ధార్మిక సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముస్లిము సంఘాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. లౌకికతత్వం పట్ల దేశంలో నికరంగా నిలబడాల్సిన పార్టీలు మతోన్మాదు పార్టీలతో చేతులు కలిపి ముస్లిం ప్రజలకు అన్యాయం చేస్తే ఆందోళన చేతపడతామని హెచ్చరించారు. మసీదులు, దర్గాలు, శ్మశానవాటికలు నేడు ప్రమాదంలో పడే పరిస్థితి ఉందని, సమాజంలో అన్ని సంస్థలు సంఘాలను కలుపుకుని అవసరమైతే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎన్వై నాయుడు సంఘీభావం ప్రకటించారు. రాజ్యాంగానికి కట్టుబడి అన్ని పార్టీలు అన్ని మతాలను గౌరవించాలని సుప్రీంకోర్టు సూచనలను కూడా అమలు చేయాలని, బిజెపి ఉచ్చులో పడి రాష్ట్రంలో జనసేన, టిడిపి ముస్లింలకు ద్రోహం చేయాలని చూస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. భవిష్యత్తులో సవరణ చేసిన బోర్డులో బిజెపి ఇతర మతస్తులను పెట్టి గొడవలకు కూడా సిద్ధపడే ప్రమాదం ఉందని, కావున ఇప్పటి నుంచే ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న ముస్లిము ప్రతినిధులు

ప్రధాన సమస్యలపై సిపిఎం పోరుబాట

కొమరాడ : మండలంలోని ప్రధాన సమస్యలపై ఈనెలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం జరుగుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అన్నారు. కొమరాడలో ఆదివారం సిపిఎం విస్తృత స్థాయి సమావేశం ఊయిక వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఈ సమస్యల పైన ఈనెల 16 నుంచి 20 వరకు అన్ని గ్రామాల్లో పోరుబాటు నిర్వహించి భూ సమస్యలను పరిశీలించి అనంతరం ఈనెల 21న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని అన్నారు. ఈనెల 22 నుంచి 27 వరకు మండలంలో అసంపూర్తిగా వదిలేసిన గిరిజన గ్రామాల రహదారులను పరిశీలించి, గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. ముఖ్యంగా మండలంలో తొమ్మిది పంచాయతీలు 40 గిరిజన గ్రామాలకు ఉపయోగకరమైన పూర్ణపాడు-లాబేసు వంతెన ప్రారంభించి నేటికి 19ఏళ్లయినా పాలకులు పత్రికా ప్రకటనలు, మాయమాటలు చెప్పడమే తప్ప నేటికీ ఆ వంతెన పూర్తికాని పరిస్థితి ఉందని అన్నారు. ఈ నెలలో ఈ వంతెన పనులు ప్రారంభించాలని కోరుతూ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. కావున సిపిఎం ఆధ్వర్యంలో జరగనున్న పోరుబాటలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, శివున్నాయుడు, లక్ష్మునాయుడు, రామారావు, గిరిజన సంఘాల నాయకులు ఎత్తున పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ప్రదీప్‌చంద్రదేవ్

క్రికెట్ టోర్నీలో విజేత పోలీస్ టీమ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సింగుపురంలో గత 20 రోజులుగా శ్రీ జాకారమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం బెల్లిడి జట్టు, ఎల్విన్‌పేట సిఐ బి.హరి ఆధ్వర్యంలో ఆడిన పోలీస్ టీం మధ్య రసవత్తంగా పోరు జరగ్గా చివరకు పోలీస్ టీమ్ విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌చంద్ర దేవ్ పాల్గొని విన్నర్ జట్టుకు నగదు బహుమతి రూ.20వేలు నగదు, ట్రోపీని అందజేశారు. అలాగే రన్నర్ జట్టుకు రూ.10వేలు నగదు, టోపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో యువత క్రీడలపై ఆసక్తి కనబర్చి టోర్నమెంట్లు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. క్రీడలతో పాటు చదువుల్లో కూడా రాణించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

గొయిదిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి

గొయిదిలో తడి, పొడి చెత్త పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గొయిదిలో గల అన్ని గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తపై ఇఒపిఆర్‌డి కె.సత్యం, పంచాయతీ కార్యదర్శి కె.సుదర్శనరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఇంటింటా డోర్ టు డోర్ కలెక్షన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి, పీసా ప్రతినిధులు, క్లాప్ మిత్రాలు డోర్ టు డోర్ సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. అనంతరం ఆ షెడ్ వద్ద తడి, పొడి చెత్త వేరుచేసి వర్మీ కంపోస్ట్ తయారీ చేశారన్నారు. ప్రస్తుతం 300 కేజీల పైగా వర్మీ అందుబాటులో ఉందని పంచాయతి సెక్రటరీ తెలిపారు. ఎవరైనా కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయిస్తామని చెప్పారు.

స్వచ్ఛభారత్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఇఒపిఆర్‌డి వర్మ

గ్రామాల్లో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రంగంపేట, పనుగుపేట, కోట సీతారాంపురంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి దాని ద్వారా ఆర్థిక వనరులను సేకరించి గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై ముందుగా ప్రజలకు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కామేశ్వరరావు, రోహిణి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఆదివారం పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పేదలకు అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. జీవో 117 అమలుతో యుపి పాఠశాలలు మూత పడుతున్నాయని విమర్శించారు. జీవో 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, కస్తూరి, శ్రీనివాస్, శంకరరావు, రామారావు పాల్గొన్నారు.

'సీతం'లో ముగిసిన ఎఐడి వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎంసిఎ విద్యార్థులకు ఐదు రోజులపాటు నిర్వహించిన ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ ముగిసింది. ట్రైనర్ మహంతి పృథ్వీ.. విద్యార్థులను పోటీ కోడింగ్‌పై చక్కగా తీర్చిదిద్ది కోడింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనేలా ఆసక్తి పెంపొందించారు. విద్యార్థులు అనేక పజిల్స్ అభివృద్ధి చేశారు. కార్యక్రమంలో సీతం ప్రిన్సిపల్ ద్వివేదుల రామమూర్తి, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఇనపకుర్తికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

పూసపాటిరేగ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ ఇనపకుర్తి చిన్న సత్యనారాయణకు జాతీయస్థాయి ఆర్ట్ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. విజయవాడకు చెందిన డ్రీమ్ అండ్ చిల్డ్రన్స్ అకాడమీ నిర్వహించిన 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ హార్కిటెక్చర్ విజయవాడ ఆడిటోరియంలో వికసిత్ భారత్‌లో భాగంగా మన ప్రకృతి మనం కాపాడుకుందాం పేరుతో ఆర్ట్స్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పూసపాటిరేగ ఉన్నత పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు చిన్న సత్యనారాయణనీ ఆహ్వానించి, అతను గత 30 సంవత్సరాలుగా చిత్రకళకు చేస్తున్న సేవలను గుర్తించి జాతీయస్థాయిలో ఉత్తమ చిత్ర కళా ఉపాధ్యాయునిగా (బెస్ట్ ఆర్ట్ టీచర్) అవార్డుతో సత్కరించారు.

వైద్యానికి నీడ కరువు

- అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు
- రోగులకు, సిబ్బందికి తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి -వీరఘట్టం

అసలే అనారోగ్యం... నయం చేసుకొనేందుకు ఆసుపత్రికి వస్తే ఆ దావాఖాకు కూడా సుస్తే... ఇక ఆ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది తీవ్ర అయోమయంలో పడ్డారు. వైద్యశాలల్లో కనీస సౌకర్యాల్లేకపోవడంతో సిబ్బంది తీవ్ర అవస్థలుపడుతున్న దుస్థితి మండలంలో చోటు చేసుకుంది. దీంతో రోగులు అరకొర సౌకర్యాలతో కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో వీటిని నిర్మించి వాటికి తగ్గ సిబ్బందిని కూడా నియమించింది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టినప్పటికీ కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయానికి గండి కొట్టినట్లు అయ్యిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

కిమ్మి గ్రామంలో పునాదులకు పరిమితమైన హెల్త్ క్లినిక్

మండల కేంద్రంతో పాటు చిట్టిపూడివలస, కిమ్మి, రేగులపాడు, తెట్టంగి, తలవరం, పనస నందివాడ, నడిమికెల్ల, చిదిమి, చినగోర గ్రామాల్లో వివిధ దశల్లో భవన నిర్మాణ పనులు జరిగాయి. చలివేంద్రిలో అసలు పనులే ప్రారంభించలేదు. దీంతో నడిమికెల్ల, తెట్టంగి, చలివేంద్రి, దశమంతపురం, రేగులపాడు, తలవరం, చిదిమి, వీరఘట్టం 1,2,4 ఉప కేంద్రాలకు భవన సదుపాయాల్లేకపోవడంతో ఇరుకైన అద్దె భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. 2024 జులై 3న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి నడిమికెల్లలో ఇరుకైన అద్దె భవనం విధులు నిర్వహిస్తున్నామని, చిన్నపాటి చినుకు పడినా భవనం కారిపోతుందని, దీంతో విలువైన వైద్య పరికరాలు పాడవుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామపంచాయతీ ఖాళీగా ఉన్నందున అందులో తమకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినా లేకపోయింది.

వీరఘట్టంలోనే చెట్ల నీడలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

చెట్ల నీడలో వైద్య శిబిరం

మండల కేంద్రంలోని 1,2,4 ఉప కేంద్రాలతో పాటు చలివేంద్రి, నడిమికెళ్ల, దశమంతపురం, తలవరం, రేగులపాడు, తెట్టంగి, పనస నందివాడ తదితర గ్రామాల్లో హెల్త్ క్లినిక్ భవన పనులు పూర్తి కాకపోవడంతో గ్రామాల్లో 104 వాహనం ద్వారా చెట్ల నీడలో, ఆలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో, విశాలమైన పంట పొలాల్లో రోగులకు వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో వైద్యం చేసుకునేందుకు వచ్చిన రోగులు, వైద్య తనిఖీలు చేసిన సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి విశాలమైన ప్రాంతంలో రోగులకు వైద్య సేవలందించేందుకు వీలుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఉభయ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. సీతారామస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శ్రీ వివి అప్పలాచార్యులు, మురపాక రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. కోదండ రామ స్వామి వారి వసంత నవరాత్రి మహోత్సవాలు ముగిసినంతరం భక్తులకు ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం దాతలు మార్కొండ సీతంనాయుడు, రమణమ్మ దంపతులు అందజేశారు. అలాగే వసంత నవరాత్రి మహోత్సవాలకు, రామస్వామి వారి కల్యాణ మహోత్సవానికి దీక్షా వస్త్రాలు, పూజా సామగ్రిని జయంతి మోహన వెంకట శేషా చలపతిరావు- లక్ష్మీ దంపతులు, కడియం రామకృష్ణ - మాధురి దంపతులు మరియు కిమిడి శ్రీరామమూర్తి - భాగ్యలక్ష్మి దంపతులు అందజేశారు. భక్తులకు అన్నదానాన్ని టిటిడి ఎస్‌టివారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పార్వతీపురం టౌన్ : శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలో పాత బస్టాండ్ వద్ద గల పురాతన సీతారామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సీతారాములకు పట్టు వస్త్రాలను సమర్పించి, పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలువురు దంపతులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఈ సీతారామ కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గుణదలో లలితా విద్యాగణేశ పీఠంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. పీఠాధిపతులు నిర్వహించిన ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కద్రక మల్లేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, నాయకులు అడ్డాకుల నరేష్, శేఖర్, నాగభూషణ్, శంకర్రావు, గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మాజీ కేంద్రమంత్రి కిశోర్‌చంద్రదేవ్

రామాలయ నిర్మాణానికి మాజీ ఎంపి రూ.3లక్షలు విరాళం

కురుపాం: శివన్నపేటలో రామాలయ ఆలయ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్ దేవ్ శ్రీరామనవమి వేడుకుల పాల్గొని అనంతరం ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులకు రూ.3 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తమవంతు సహాయం అందించడం ఆనందదాయకంగా ఉందన్నారు. అనంతరం భక్తులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం : శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని కురుపాం కోటలో కేంద్ర మాజీ మంత్రి కిషోర్ చంద్రదేవ్ కుటుంబ సమేతంగా హెూమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా కోటలో హనుమత్ సీతాలక్ష్మి, భరత శత్రుఘ్న శ్రీరామచంద్ర మూర్తికి ప్రీతికరగా ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు వసంత నవరాత్రులు నిర్వహిస్తూ చివర రోజున యజ్ఞ హెూమాలతో ప్రత్యేక పూజలు చేయడం తమ పూర్వీకుల నుంచి ఆచారంగా వస్తుందని అన్నారు.

కొమరాడ : మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు చేరుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామంలో మహిళల కోలాటం పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఉత్సవాల అనంతరం గ్రామ కమిటీల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

వీరఘట్టం : మండలంలోని శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో సీతారాముల కళ్యాణం జరిపేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గరుగుబిల్లిలో సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

సీతంపేట : మండలంలో పలీపుట్టి సమీపానున్న రామగిరి క్షేత్రం వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పిఒకు కమిటీ సభ్యులు పూర్వకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే జామ తోట వద్ద శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సీతంపేటలో కోదండరామ ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రామం మందిరాల వద్ద సీతారామ కల్యాణాలు చేసి సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీపురం, బూర్జ, గుడ్డుపేట, సీతానగరం తదితర గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.

భామిని : మండలంలోని చిన్నదిమిలిలో రామాలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా దంపతులతో ప్రేత్యేక పూజలు నిర్వహించారు. సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదాలను ఆలయం కమిటీ సభ్యులు అందజేశారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సిపురం పెద్దవీధిలో శ్రీరామ కల్యాణం మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. అలాగే పెద్ద బొండపల్లి, ఎంఆర్ నగరం, చిన్న బొండపల్లి సంఘం వలస, పుట్టూరు, బందులుప్పి, జమదాల తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

కాళిదాసు యాజి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం

పార్వతీపురం టౌన్ : శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం సర్వమంగళదేవి పీఠం శ్రీవిద్యా ఉపాసుకులు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసుయాజి ఆధ్వర్యంలో వేమకోటివారివీధిలో ఉన్న ఆయన నివాసంలోసీతారాముల కల్యాణం జరిగింది. సీతారాముల కళ్యాణానికి మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాశ్ నారాయణ, ఆయన భార్య బెలగాం కరుణ నూతన వస్త్రాలు సమర్పించారు.

సబ్సిడీ కందిపప్పు రాక... బయట మార్కెట్లో కొనలేక

మూడు నెలలుగా అందని పరిస్థితి
ఇకెవైసి చేయని వారికి రేషన్ కట్

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ఆదివాసీలకు పౌష్టికాహార లోపంతో రక్తహీనత అధికంగా ఉంటుంది. అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా పౌర సరఫరాల శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ కందిపప్పు మూడు నెలలుగా అందకపోవడంతో గిరిజనులు అధిక ధరలకు బయట మార్కెట్లో కొనలేక అల్లాడి పోతున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ పూర్తి స్థాయిలో కందిపప్పు రాలేదు. దీంతో బయట మార్కెట్లో 180 రూపాయలు వెచ్చి కొనలేక పౌష్టికాహారానికి దూరంగా ఉంటున్నారు.

మండలంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో 23 డిఆర్ రేషన్ డిపోలు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 16,296 రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ లబ్ధిదారులకు ప్రతినెలా పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, పంచదార, కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. అయితే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో కందిపప్పు రాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతకు ముందు ఆరు నెలలు 70 శాతం లోపే కందిపప్పు వచ్చిందని, దీన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేయలేదని నిర్వాహకులు చెబుతున్నారు. 16296 రేషన్ కార్డు దారులకు 16296 కేజీల కందిపప్పు రావాల్సి ఉంది. కందిపప్పు ప్రభుత్వం కిలో రూ.67 చొప్పున సబ్సిడీలో ఇస్తుంది. అయితే మూడు నెలలుగా అది కూడా అందలేదు. అదేవిధంగా సంక్రాంతి, ఉగాదికి నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం బెల్లం, కందిపప్పు, గోధుమపిండి వంటివి ఏమీ ఇవ్వకపోవడంతో పేద ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ఏది ఏమైనా పేదలకు సకాలంలో పూర్తిస్థాయిలో నిత్యవసర సరుకులు సబ్సిడీపై ఇవ్వాలని రేషన్ లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా ఏప్రిల్ నెలాఖరులోగా ఆధార్‌కు ఇకెవైసి చేయకపోతే వచ్చే నెల నుంచి రేషన్ కట్ అవుతుందని రేషన్ డీలర్ల వద్ద ప్రచారం సాగుతుంది. దీంతో ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఇకెవైసిపై అవగాహన కల్పించాల్సి ఉంది. దీనిపై సివిల్ సప్లై డిటి మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా మూడు నెలలుగా కందిపప్పు రాలేదని చెప్పారు. రేషన్ కార్డులో ఉన్న వారు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని అన్నారు.

కందిపప్పు అందలేదు

కందిపప్పు డిపోలో ఇవ్వడం లేదు. బయట కొనలేక పోతున్నాను. బియ్యం, పంచదార మాత్రమే డిపోలో ఇస్తున్నారు. బయట దుకాణాల్లో రూ.180 కందిపప్పు విక్రయిస్తున్నారు. కావున ప్రభుత్వం రేషన్ డిపో ద్వారా సబ్సిడీ కందిపప్పు ఇప్పించాలి.

సవర తోటయ్య గిరిజనుడు.
బొంగడుగూడ

బయట మార్కెట్లో కొనలేక పోతున్నాం

జిసిసి నిర్వహిస్తున్న డిపోల్లో సబ్సిడీ కందిపప్పు మూడు నెలలుగా అందటం లేదు. దీంతో బయట మార్కెట్లో కొనలేక పోతున్నాం. అంతేకాక సంక్రాంతికి అదనంగా ఎటువంటి సరుకులు అందలేదు. పంచదార కూడా అర కేజీ మాత్రమే ఇస్తున్నారు.

పత్తిక కుమార్

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలో లింగాలవలస కొండపై అక్రమ గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. శనివారం కూడా ఆలయం వెనుక భాగంలో తవ్వకాలు కొనసాగించారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు వెంటనే స్పందించి అక్రమ తవ్వకాలు అడ్డుకున్నారని చెప్తున్నారు. సుమారు నాలుగు ట్రాక్టర్లు జెసిబిని పట్టుకొని అపరాధ రుసుం వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు దీనిపై పెద్దగా స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక ప్రైవేట్ వ్యక్తి స్థలంలో ట్రాక్టర్ 1200 చొప్పున గ్రావెల్ అమ్మకాలు చెరుకుపల్లికి చెందిన వ్యక్తి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై విఆర్ఒ సంతోషి మాట్లాడుతూ అక్రమ గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెళ్లామన్నారు. ఇక్కడ మట్టి అక్రమంగా తవ్వితే కేసులు నమోదు చేస్తామని జెసిబి యజమానిని హెచ్చరించినట్లు ఆమె తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కిందపడి హెచ్ ప్రసాద్ (57) మృతి చెందారు. రైల్వే ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి శనివారం రాత్రి చీపురుపల్లి రైల్వే స్టేషన్ నుండి విజయవాడ బయలుదేరాడు. అయితే ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మృతుడు ప్రసాద్ కుటుంబ పోషణ నిమిత్తం విజయవాడలోని ఒక హోటల్లో పనిచేస్తున్నట్టు స్థానికులు తెలిపారు.

ఉరేసుకుని బీహార్ వాసి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయం ఎల్అండ్‌టి లేబర్ కాలనీలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ (25) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి కూలీలందరూ పనికి వెళ్ళిపోయిన తరువాత తువ్వాలుతో ఉరివేసుకొని మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనం కోసం వచ్చిన కూలీలు అందరు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

జెసిబి, ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలస సాలావారి చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న జెసిబి, రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. చెరువులో గ్రావెల్ తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో తహశీల్దార్ ఎం.శ్రీను ఆదేశాలు మేరకు ఆర్ఐ కె.రాంకుమార్, విఆర్ఒలు దాడి చేసి జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి
9మందికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని అక్కనుగూడ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడి సవర పెద్ద తిక్కమ్మ (57) అక్కడికక్కడే మృతిచెందగా 9మందికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజన్నగూడ నుంచి ఆటోలో పెద్ద తిక్కమ్మ కుటుంబ సభ్యులతో పాటు మిగతావారు పార్క్‌కు వస్తుండగా అక్కన్నగూడ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో తిక్కమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా 9 మంది గాయాలు పాలయ్యారు. వీరిలో సాయికుమార్, ఉషారాణి, సునేమి, రాసి లచ్చయ్య తదితరులు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేసినట్లు ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీనివాసరావు. తెలిపారు. తిక్కమ్మది రాజన్నగూడ. ఆమెకు భర్త చంద్రయ్య, కుమారులు చలపతి, లక్ష్మణ, కుమార్తె ఉషరాణి ఉన్నారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్ఐ వై అమ్మనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఇప్పటివరకు ఉండి మృతి వార్త వినగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
O.S.No.32/2024

Between:
కర్రి క్రిష్ణవేణి ....వాది
And:
దుంది గణేశ్ నాని బాబు ....ప్రతివాది

నోటీసు

దుంది గణేశ్ నాని బాబు, వయసు 44 సంవత్సరములు, తండ్రి సుందర రావు, Official colony, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై పై కోర్టులో దావా సొమ్ము రాబట్టు నిమిత్తము దావా వేసియున్నారు. సదరు దావా **తేదీ:7-4-2025**న శ్రీ కోర్టువారు వాయిదా వేయింపించియున్నారు. వాయిదా దినం **ఉదయం 10.30 గంటల**కు మీరు గాని, మీ వలన ఆర్డరు పొందినవారు గాని, మీ తరుపున ప్లీడరుగారు గాని, పై కోర్టులో హాజరు అయ్యి మీ తరుపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై అమలు మీ పరోక్షమున తీర్మానము జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

గొర్లె కిరణ్ కుమార్,
వాది తరుపు న్యాయవాది,
సాలూరు, సాలూరు,
తేదీ:6-4-2025 సెల్: 9963265374, 9398505023.